## మంత్రికి ఆహ్వాన పత్రిక

**చిన్నమండెం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :..**

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈనెల 17వ తేదీ బెంగళూరులో జరిగే సౌత్ రీజియన్ బస్ ఓనర్స్ సమావేశానికి మంత్రివర్యులు హాజరుకావాలని ఆదివారం చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారి పల్లెలో మంత్రివర్యులకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ.... ఈ కార్యక్రమానికి తప్పక హాజరవుతారని వారికి హామీ ఇచ్చారు.




# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

**సోమవారం 14 ఏప్రిల్ 2025**


## అలరించిన నృత్య ప్రదర్శనలు

**పులివెందుల,ఏప్రిల్13,ప్రభాత వార్త:**

పట్టణ పరిధిలోని శిల్పారామం లో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం వారాంతపు కార్యక్రమంలో భాగంగా జీవనజ్యోతి పాఠశాల విద్యార్థులు చేసిన జానపద, క్లాసికల్ ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో జీవన జ్యోతి పాఠశాల ఉపాధ్యాయులు, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లాలో సైకిల్ ఎటు పోతుంది..?

- మొన్న రాజంపేటలో అన్న క్యాంటిన్ ప్రారంభోత్సవంలో..
- నేడు రైల్వేకోడూరు టిడిపి ఆఫీస్‌పైనే దాడి
- తంబళ్లపల్లిలో రోడ్డుపైనే తెలుగుతమ్ముళ్ల బైఠాయింపు
- పోలీసుల రంగప్రవేశం వరకు పరిస్థితులు

**(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)**

అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే అన్నమయ్య జిల్లాలో అధికార తెలుగుదేశం పార్టీలో అంతర్గత కుమ్ములాటలు తారాస్థాయికి చేరుకున్నాయి. నియోజకవర్గంలోని పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు, అభిమానులు, సానుబూతిపరులందరితో సమావేశం ఏర్పాటు చేసుకోలేని దుస్థితి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ ఎదుర్కొంటుందంటే అతిశయోక్తి కాదు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జనార్ధన్‌రెడ్డి, జోనల్ 4 ఇన్‌ఛార్జ్ దీపక్‌రెడ్డిలు సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో వీరి సమక్షంలోనే తెలుగుతమ్ముళ్ల దాడులు చేసుకొని, కొట్టుకునే పరిస్థితులు నెలకొని రసాభాసాగా మారాయి. ముఖ్యంగా రాజంపేట, రైల్వేకోడూరు, తంబళ్లపల్లి నియోజకవర్గ సమన్వయ సమావేశాల్లో నేతల్లో గూడుకట్టుకొని ఉన్న అసమ్మతి భగ్గుమంది. జిల్లాలోని రాజంపేటలో నాలుగైదు నెలల క్రితం అన్న క్యాంటిన్ ప్రారంభోత్సవంలో గత ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేసిన సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజుల మధ్య నేరుగానే విబేధాలు బట్టబయలయ్యాయి. తాజాగా రాజంపేట, రైల్వేకోడూరు, తంబళ్లపల్లి అసెంబ్లీ నియో జకవర్గాల సమన్వయ సమావేశాల్లో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జనార్ధన్‌రెడ్డి, దీపక్‌రెడ్డిల సమక్షంలోనే నేతల మధ్య విబేధాలు బట్టబయలై పోలీసులు రంగప్రవేశం చేసే వరకు పరిస్థితులు వెళ్ళాయి. చివరకు పార్టీ అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతోనే సమావేశాలు ముగించుకొని వెళ్ళే పరిస్థి తులు నెలకొన్నాయి. గత ఎన్నికల్లో జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీలు ఎన్‌డిఏ కూటమిగా ఏర్పడినా ప్రస్తుతం వీరి మధ్య సఖ్యత చాలావరకు తగ్గింది. ఎన్‌డిఏ కూటమి పార్టీల మధ్య దేవుడెరుగు దేశం పార్టీలోనే సమన్వయం కరవైంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు దగ్గర పడుతున్న వేళ జిల్లాలో ఒక రాజంపేట, రైల్వేకోడూరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లోనే కాదు, మిగిలిన రాయచోటి, పీలేరు, మ దనపల్లి నియోజకవర్గాల్లో కూడా పరిస్థితులు అటూ ఇటూగానే ఉన్నాయి. మొదట రాజంపేట నియో జకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలోకి పార్టీ నేతలందరికి అవకాశం ఇవ్వలేదని తెలుగుతమ్ముళ్లు నిరస న వ్యక్తం చేస్తూ రసాభాసా గావించారు. అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గస్థాయి నేతలమని చెప్పుకునే వారు కలిసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఎవ్వరికి వారు యమునా తీరన్న చందంగా ఉన్నారు. దీంతో క్రిందిస్థాయి కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి



తంబళ్లపల్లి తెలుగుతమ్ముళ్లు బైఠాయించిన దృశ్యం

ఓటమి చవిచూసిన సుగవాసి బాలసుబ్రమణ్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డిలు ఎవ్వరికి వారుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. ఇక రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఒక అడుగు ముందుకేసి తెలుగుదేశం పార్టీ కార్యాలయం పైనే తెలుగుతమ్ముళ్లు దాడులు చేసే వరకు పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ అన్న మయ్య అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ఛైర్మెన్ ముక్కా రూపానందరెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఇన్‌ఛార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు వర్గాల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు పార్టీ ఆఫీసుపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేసేవరకు పరిస్థితులు వెళ్ళాయి. ఈ దాడుల్లో కొందరు పార్టీ కార్యకర్తలకు గా యాలైనట్టు కూడా సమాచారం. ఇక తంబళ్లపల్లి నియోజకవర్గంలో కూడా ఇన్‌ఛార్జ్ సైకం జయ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గాల మధ్య నెలకొన్న విబేధాలు బట్టబయలయ్యాయి. శంకర్ వర్గం సమావేశానికి అనుమతించడం లేదని బైటాయించారు. ఈ మూడు నియోజకవర్గాల్లో అసమ్మతి నేతల ఆందోళనలను అదుపు చేసేందుకు పోలీసులు రంగప్రవేశం చేసేవరకు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఓ రకంగా చెప్పాలంటే విపక్ష వైసిపి కంటే పార్టీలోని నేతలే ఒకరికొకరు దెబ్బతీసుకునేందుకు, ఇందుకోసం పార్టీ ప్రయోజనాలను కూడా పణ్ణంగా పెట్టేందుకు వెనుకాడని పరిస్థితులు ఏ మాత్రం పార్టీకి భవిష్యత్తులో తీరని నష్టం చేకూర్చి పెడుతుందని పార్టీ శ్రేణులే వాపోతున్నారు. నేతల మధ్య నెలకొన్న విభేదాలతో కార్యకర్తలు, అభిమానులు కూడా ఏ నేత వద్దకు వెళ్ళాలో అర్థం కాక అయోమయానికి గురవుతుండడంతో ఓ రకంగా చెప్పాలంటే స్తబ్ధత నెలకొంది. ఇవన్నీ తెలిసి కూడా పార్టీ అధిష్టానం చూస్తూ ఊరకుండడంతో ఎవ్వరికి వారు బలాన్ని చూపుకునేందుకు పోటీ పడుతున్నారు. త్వరితగతిన పార్టీ అధిష్టానం స్పందించి నేతల మధ్య సమన్వయం కుదర్చకపోతే భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ అన్నమయ్య జిల్లాలో పెద్దమూల్యమే చెల్లించుకోవాల్సి వస్తోంది.

### అభివృద్ధి కార్యక్రమాలతో

## రూపురేఖలు మారనున్న నియోజకవర్గం

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**చిన్నమండెం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**

నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి పట్టణ రూపురేఖలు మార్చడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం, బోరెడ్డి గారిపల్లెలోని తమ నివాసం నందు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గతంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోని రాయచోటి నియోజకవర్గం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, మంచినీటి సమస్య పరిష్కరించడం, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి నియోజకవర్గ రూపు రేకులు మార్చడం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 9 నెలల కాలంలోనే ప్రాధాన్యత క్రమంలో అవసరమైన గ్రామాలలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేసి గ్రామాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. నీటి సమస్యతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వివిధ గ్రామాలలో నూతన బోర్లు వేసి మోటార్ బిగించి గ్రామాలకు నీరు విడుదల చేయడం జరుగుతుందన్నారు. మంత్రి నిరంతరం గ్రామాలలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే బాధితుల సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది.

## ఆహ్లాదకరమైన కొండలు...గుట్టలు.. పచ్చని పైర్లు...

**సినిమా షూటింగులకు అనుకూలం... మదనపల్లె-రామసముద్రం రోడ్డు...**

**రామసముద్రం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**

చుట్టూ కొండలు..ఎత్తైన చెట్లు...గుట్టలు...దూరంగా అలరాడుతున్న మేఘాలు...చల్లటి గాలి...రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలు...పచ్చని పైర్లు...సెలయేరులా కనువిందు చేసే చెరవులు...ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో వింతలు కనపడుతాయి. మదనపల్లె-రామసముద్రం రోడ్డు మార్గాన ఆహ్లాదకరంగా ఉండే పచ్చదనం, చూడముచ్చటైన ఎత్తైన కొండలు, గుట్టలు, వర్షాలు పడితే ప్రయాణికులను తాకుతూ వెళ్ళేలా ఉండే మేఘాలు, చల్లటి గాలిని ఇచ్చే రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలతో ఆ మార్గం కనువిందు చేస్తోంది. లోతట్టు ప్రాంతాలు, అక్కడ ఉండే పలు రకాల వృక్షాలతో చూడగానే కనువిందు చేస్తోంది. సినిమా షూటింగులకు మంచి అనుకూలంగా ఆ ప్రాంతాలు ఉన్నాయి. మదనపల్లె-రామసముద్రం మార్గం మొత్తం ఘాట్ ప్రయాణమే. అతి ప్రమాదకరమైన మలుపులు, ఘాట్లు, కొండలు, గుట్టల నుంచి ప్రయాణం చేయాల్సివస్తుంది. ఈ మార్గంలో చూడ ముచ్చటైన ప్రాంతాలు అనేకం ఉన్నాయి. ఈ మార్గంలో వెళ్ళే వారు ఈ ప్రకృతి అందాలను చూస్తు ముచ్చట పడుతారు. మొత్తం 24కిలోమీటర్లు ఉండే రోడ్డు మార్గంలో ప్రయాణం చేయాలంటే ఆహ్లాదకరంగా ఉంటుంది. సినిమా, టివి సీరియల్స్ షూటింగ్‌లకు ఈ ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ ప్రాంతమంతా పచ్చని చెట్లతో కళకల లాడుతున్నాయి. చెరువులు, కుంటల్లో నీళ్ళు ఉండడంతో అనేక రకాల పక్షులు, అటవీ జంతువులకు ఉపయోగపడుతున్నాయి.



రామసముద్రం మార్గంలోని అందమైన లోకేషన్

## కాళీయమర్దనాలంకారంలో....

**అశ్వావాహనంపై భక్తులకు దర్శనం**





**రాజంపేట అర్బన్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన ఆదివారం ఉదయం కాళీయమర్దనాలంకారంలో స్వామి భక్తులను కటాక్షించారు. ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు స్వామివారి వాహన సేవ వైభవంగా జరిగింది. భజన బృందాలు భజనలు, కోలాటాలు ఆడుతుండగా స్వామివారు పురవీధుల్లో విహరించారు.వాహనసేవ అనంతరం ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం వేడుకగా ప్రారంభమైంది. ఇందులో పాలు, పెరుగు, తేనే, చందనంతో శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరాములవారి ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేశారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

**నేడు ఒంటిమిట్టలో చక్రస్నానం**

శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు చక్రస్నానం వైభవంగా జరుగనుంది. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణముతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

## నివాస ప్రాంతంలో చెత్తాచెదారం.. ఇబ్బందుల్లో స్థానికులు

**పీలేరు ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**

నివాస ప్రాంతాల మధ్య చెత్తాచెదారం తోలి దానికి నిప్పు పెడుతుండడంతో అక్కడి పరిసర ప్రాంత ప్రజలు ఊపిరాడక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వివరాల్లోకి వెళితే పీలేరు మదనపల్లి జాతీయ రహదారిలోని ఈద్గా పక్కన ఉన్న 2.50 ఎకరాల చెన్నకేశవ స్వామి దేవస్థానం భూమిని న్యాయస్థానాల సముదాయం నిర్మాణం కోసం అప్పగించార్. అక్కడ న్యాయస్థానాల సముదాయ నిర్మాణం చేపట్టడంలో ఆలస్యం కావడంతో పీలేరు గ్రామ పంచాయతీ సిబ్బంది దాన్ని డంపింగ్ యార్డ్‌గా వినియోగించుకోవడం మొదలు పెట్టింది. రోజు వారీ అందులో వందకు పైగా ట్రాక్టర్ల చెత్తను అక్కడ డంప్ చేయడం, ఆ చెత్తకు నిప్పు పెడుతుండడంతో అందులోంచి వెలువడే పొగ ఆ పరిసరాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు, ప్రక్కనే ఉన్న బాలికల వసతి గృహం, ఆ ప్రక్కనే గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో ఉంటున్న విద్యార్థులు కూడా పొగ వాసనలతో చికాకు పడుతున్నారు. వారి ఆరోగ్యాలు పాడయ్యే ప్రమాదం ఉందని ఆరోగ్య సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని న్యాయస్థానాల సముదాయం కోసం కేటాయించిన స్థలంలో ని చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని హెచ్చరిస్తున్నారు.



న్యాయస్థానాల సముదాయం కోసంజెల్ కేటాయించిన స్థలంలో చెత్త పోస్తున్న ట్రాక్టర్

## వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం

**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**



బద్వేల్ మునిసిపాలిటీ పరిధి చెన్నంపల్లి ఆవరణంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ఆది చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా పలువురు వేద పండితులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది, అది వారం ప్రత్యేక ఉభయ దాతలుగా పెద్ది రెడ్డి కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలను నిర్వహించారు, ముందుగా స్వామివారికి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు వివిధ రకాల విశేష పూజలను నిర్వహించారు, అనంతరం రాత్రి గజ వాహనం పైన మాడవీధులలో స్వామి వారు పలువురు భక్తులకు దర్శనం ఇచ్చారు, పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి అడుగడుగునా మంచినీరు వారు పోసి కాయ కర్పూరం సమర్పించుకొని పలువురు భక్తులు తమ భక్తిని చాటుకున్నారు, కోరిన కోరికలు తీర్చే శ్రీ ఆది చెన్నకేశవ స్వామివారిని దర్శించుకోవడానికి బద్వేల్ పట్టణ పరిధి పరిసర గ్రామీణ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యల తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు, స్వామివారి దర్శించుకున్న భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగ కుండా ఆలయ ఈవో రామలింగారెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ పంగా చెన్న కృష్ణారెడ్డి, పంగా జయమ్మ, సానుపురెడ్డి పార్వతి, నాగి పోగు ఆనందమ్మ, వేముల సుబ్బ లక్ష్మమ్మ, బిజీ వేముల సుధాకర్ రెడ్డి, జయంత్ కుమార్, పసుపుల ప్రసాద్ ఇండ్ల నాగయ్యతో పాటు పలువురు ఆలయ సిబ్బంది ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలను అందజేశారు

**వైభవంగా కళ్యాణ మహోత్సవం :** శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఆది చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది, స్వామివారికి కళ్యాణ వస్త్రాలను మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, డాక్టర్ రవికుమార్ రెడ్డి, టిడిపి యువనేత రితీష్ రెడ్డి కుటుంబ సభ్యులు చేతుల మీదుగా కళ్యాణ వస్త్రాలను సమర్పించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు, స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసిన పలువురు భక్తులకు ఆలయ ట్రస్ట్ బోర్డ్ సమ్మెలు ప్రత్యేక తీర్థప్రసాదాలు తోపాటు అన్నప్రసాద్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో విశేషాలు భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి గురించి మాట్లాడే అర్హత రమేష్ కుమార్ రెడ్డికి లేదు

**మీడియా సమావేశంలో టిడిపి నేతలు**

**రాయచోటి ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**

గడిచిన 20 సంవత్సరాలుగా ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఒడిదుడుకులు ఎదుర్కొని ఎవరు ఎన్ని అన్నా లెక్కచేయకుండా ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా అన్నమయ్య జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని విమర్శించే హక్కు రమేష్ కుమార్ రెడ్డి కి లేదని ,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష,జిల్లా మైనార్టీ కార్యదర్శి వతన్ నిస్సార్, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లి శ్రీనివాసులు నాయుడు,మాజీ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి లు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి 7 గంటలకు స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా ఉన్న రమేష్ కుమార్ రెడ్డి గత వైసీపీ ప్రభుత్వంలో వైసిపి వారితో లాలూచీపడి పార్టీని దెబ్బతీశారని ఆరోపించారు.మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎన్నో కష్టనష్టాలకు వచ్చి ఎవరు ఎన్ని మోసాలు చేసినా వాటిని లెక్క చేయకుండా ప్రజలకు అండగా నిలిచి ప్రజల అండతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా నేడు ప్రజలందరికి వచ్చి ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నారని చెప్పారు. కంకర దొంగలేంచాల్సిన అవసరం మంత్రికి లేదని,అనవసరంగా మంత్రిపైనా,మంత్రి కుటుంబం పైన రమేష్ కుమార్ రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు.మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన మీరు ఇన్చార్జిగా ఉండి ఏమి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు.ప్రభుత్వం వచ్చి పది నెలలు గడిచిందని ఇప్పుడిప్పుడే అన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నమయ్య జిల్లాలో ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే కాకుండా రాయచోటి నియోజవర్గంలో శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం మంత్రి నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు.ఏదైనా ఆరోపణలు చేస్తే ముందు మంత్రి గురించి తెలుసుకోవాలని నీతికి,నిజాయితీకి ప్రజలకు ఇచ్చిన మాట కోసం కట్టుబడి పనిచేసే వ్యక్తి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. వీరితో పాటు పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## మంత్రి పేరు చెప్పి దొంగతనాలు చేస్తే మాట్లాడకూడదా?.

**వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ రమేష్ కుమార్ రెడ్డి.**

**రాయచోటి ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**

మంత్రి అధికార హోదాలో ఏం మాట్లాడినా చెల్లుబాటు అవుతుందని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి మాట్లాడడం పై వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ రమేష్ కుమార్ రెడ్డి భగ్గుమన్నారు. ఆదివారం రాయచోటిలోని అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడిన వ్యాఖ్యలపై రమేష్ కుమార్ రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. జాతీయ రహదారి పని కోసం నిల్వ ఉంచిన కంకర సామాగ్రిని దొంగలించడంపై మందలించాల్సిన మంత్రి తన పేరు చెప్పుకొని ఎవరైనా తీసుకెళ్తే నేను దొంగతనం చేసినట్లా అని మాట్లాడటం దారుణమన్నారు. ఇలా అయితే మంత్రి పేరు చెప్పుకొని దర్జాగా దొంగతనాలు చేయొచ్చా?.. అని మంత్రిని నిలదీశారు. కనకపు సింహాసనముపై సునకమును కూర్చున్న పెట్టిన తన పని తను చేసినట్లుగా రాయచోటిలో మంత్రి వ్యాఖ్యలు, చేష్టలు అద్దం పడుతున్నాయన్నారు. తాను ఎన్నికల సమయంలో కోట్ల రూపాయలు డబ్బులు తీసుకొని వైసీపీలోకి వచ్చినట్లు చేసిన ఆరోపణలపై వీరభద్ర స్వామి దేవస్థానంలో ప్రమాణానికి సిద్ధమన్నారు. మీ లాగా ఎన్నికల్లో ఒక పార్టీలో ఉంటు మరో పార్టీకి ఓట్లు వేయిస్తానని డబ్బులు తీసుకోవాల్సిన ఖర్మ నాకు పట్టలేదన్నారు. తెలుగుదేశం పార్టీ తనను చివరి వరకు వాడుకొని మోసం చేసిందన్నారు. ఆ ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు తనకు టికెట్ ఇవ్వకుండా ద్రోహం చేశారు కాబట్టే నేను పార్టీలో ఉండనని చంద్రబాబు నాయుడుకే చెప్పి బయటకు వచ్చి వైయస్సార్సీపీలో చేరానన్నారు. కడపలో నా కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా ఎన్నికల్లో ప్రచారం చేసిన విషయం జిల్లా ప్రజలకు తెలుసన్నారు. టికెట్టు కేటాయింపు సమయంలో నీకు ఎమ్మెల్సీ ఇస్తా, అది ఇస్తా, ఇది ఇస్తా అంటూ రాయబారాలు చేసిన తలొగ్గలేదన్నారు. ఇదే ఆధారం...... జాతీయ రహదారి పనులు నా పేరున లేదంటావా? పనిచేసేందుకు అన్ని అర్హతలు ఉన్న ఒప్పంద పత్రం ఇదిగో చూడండని మంత్రికి సవాల్ విసిరారు. రాష్ట్రంలోని జాతీయ రహదారి శాఖలో ఏడు మంది దగ్గర మాత్రమే ఈ ఒప్పంద పత్రాలు ఉంటాయన్న విషయం కూడా మంత్రి తెలుసుకోకపోవడం సిగ్గు చేటన్నారు. మూడుసార్లు ఎన్నికల్లో పోటీ చేస్తే రెండుసార్లు డిపాజిట్ కూడా దక్కించుకోలేని విషయాన్ని మరచిపోయావా అంటూ మంత్రిని రమేష్ కుమార్ రెడ్డి ఏద్దేవా చేశారు. సమావేశంలో నియోజకవర్గం లోని పలువురు వైఎస్సార్ సిపి నాయకులు పాల్గొన్నారు.



# హార్సిలీహిల్స్‌లో తన్నుకొన్న తెలుగుతమ్ముళ్ళు

మదనపల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :

ప్రముఖ వేసవి విడిది అయిన హార్సీలీహిల్స్ లో తంబళ్ళపల్లె నియోజకవర్గ తెలుగుతమ్ముళ్ళు తన్నుకొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి సర్ది చెప్పినా శాంతించికుండ ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఆదివారం హార్సీలీహిల్స్ లో తంబళ్ళపల్లె నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ వర్గీయులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరిపల్లె జయచంద్రారెడ్డి వర్గీయుల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలకు దిగి ఘర్షన పడ్డారు. ఇరువర్గాల కార్యకర్తల మధ్య ఘర్షణకు దారితీయడంతో ఇన్‌చార్జ్ మంత్రి జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. అయినా వారు శాంతించిపోవడంతో పోలీసులు జోక్యం చేసుకొన్నారు. గత ఆరు నెలలుగా నియోజకవర్గంలో శంకర్‌యాదవ్, జయచంద్రారెడ్డి వర్గీయుల మధ్య మండలాలు, గ్రామాల్లో వర్గపోరు జరుగుతూనే ఉంది. కూటమి ప్రభుత్వం ఏ కార్యక్రమం నిర్వహించినా ఈ రెండు వర్గాల మధ్య విభేదాలు ఉండడంతో ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. ఏకంగా జిల్లా ఇన్‌చార్జ్ సమక్షంలోనే ఇరు వర్గాల కార్యకర్తలు కొట్టుకోవడంతో మంత్రి అవాక్కుకు గురయ్యారు. దీంతో ఇరువర్గాల వారిని పోలీసులు చెదరగొట్టారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించుకొని వెనుదిరిగారు. అయితే మదనపల్లె నియోజకవర్గకార్యకర్తల సమావేశానికికూడా జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి హాజరు కాకుండా



ఘర్షణ పడుతున్న తెలుగుతమ్ముళ్ళు

హార్సీలీహిల్స్ నుంచి వెనుదిరిగారు. రెండు నియోజకవర్గంలోనూ టిడిపిలో వర్గపోరు ఉండడంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి తలనొప్పిగా మారింది. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ దీపక్‌రెడ్డి, జిల్లా పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, మాజీ జడ్పిటిసి పర్వీన్‌తాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉరుసు ఉత్సవాలు



దువ్వూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

మండల పరిధిలోని చింతకుంట గ్రామ పంచాయితీలో ఆదివారం శ్రీ నెమళ్లదిన్నె హుస్సేన్ వల్లి ఉరుసు ఉత్సవాలు అలాగే ఖాదర్ వల్లి స్వామి ఉరుసు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. రెండు చోట్ల ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉరుసు ఉత్సవాల సంధర్భంగా రెండు దర్గాల వద్ద ఎక్కువ సంఖ్యలో భక్తులు పాల్గొని దర్గాను సందర్శించారు. అలాగే ఉరుసు ఉత్సవాల సంధర్భంగా అన్నమాచార్య కళా పీఠం వారిచే అన్నమయ్య కీర్తనలు, బాలనాగమ్మ నాటకం, ఖవాలి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన ఎద్దులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

## ధ్యానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలి



వేంపల్లె: ఏప్రిల్ 13 (ప్రభాత వార్త):

ధ్యానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ధ్యాన బుద్ధా హిమాలయ యోగి బ్రహ్మశ్రీ కళాధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీ చైతన్య హైస్కూల్ ఆవరణంలో పౌర్ణమి ధ్యానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ఆత్మజ్ఞానం మనిషి జీవన ప్రమాణానికి మార్గదర్శకం అనే అంశంపై చాలా స్పష్టతతో హృద్యంగా బోధన ఇచ్చారు. ధ్యానం ద్వారా ఎలా మనస్సు ప్రశాంతంగా ఉండగలదో ఆత్మ విశ్వాసం పెరిగితే జీవితమే ఎలా మారుతుందో తన అనుభవంతో క్లుప్తంగా వివరించారు. ఆత్మవిశ్వాసం పెరిగితే జీవితమే ఎలా మారుతుందో తన అనుభవంతో వివరించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ కళాధర్ రెడ్డి ని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి పిరమిడ్ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవ దిశగా పూర్వ విద్యార్థులు.



రామసముద్రం ఏప్రిల్ 13 ప్రభాతవార్త

సమాజ సేవ దిశగా పూర్వ విద్యార్థులు అడుగులు వేస్తున్నట్లు 1987/88 వ సంవత్సరం రామసముద్రం జెడ్పీ హైస్కూల్ లో చదువుకున్న విద్యార్థులు తెలిపారు.గత సంవంత్సరంలో మండల కేంద్రంలోని 1987/88 వ సంవత్సరం పదవ తరగతి చదువుకున్న దాదాపు 100 మంది విద్యార్థులు 37 సంవత్సరాల తర్వాత రామసముద్రం లోని జెడ్పీ హైస్కూల్ లో కలుసుకుని, అప్పుడు చదువులు,విద్యాబుద్ది నేర్పిన ఉపాధ్యాయులకు మేలతాలలతో విద్యార్థులు ర్యాలీగా ఆహ్వానం పలుకారు. తర్వాత టిటిడి కళ్యాణ మంటపంలో వారికి గురుదక్షిణ అందించి రుణం తీర్చుకున్నారు. అప్పుడు చదువుకున్న విద్యార్థులు, కుటుంబ సమేతంగా కలుసుకుని ఆనందంతో ఒకరినొకరు కలుసుకుని ఆనందంతో పరవసించారు. బాల్యమిత్ర సేవా ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. వీరందురూ కలసి భవిష్యత్తులో అన్ని సేవాకార్యక్రమాలల్లో ముందుండి అందరికీ సేవచేసి,మానవసేవే,మాదవసేవ అని సేవచేస్తూ మన బాటలో మనతో జెడ్పీ హైస్కూల్ లో చదివిన అన్ని తరగతుల వారు ఇలాంటి సేవలు చేసి బావి తరాలకు స్పూర్తి కావాలని తెలిపారు.



## సయ్యద్ యూసుఫ్‌కు 25 వేలు ఆర్థిక సాయం

లక్కిరెడ్డిపల్లి ఏప్రిల్ 13: ప్రభాతవార్త

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం రామాపురం మండలం, గువ్వలచెరువు గ్రామంలో ఆదివారం నూతన మసీదు ప్రారంభోత్సవం సందర్భంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సయ్యద్ యూసుఫ్ తనకు ఆర్థిక సాయం అందజేయాలని మంత్రివర్యులను కోరారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తక్షణమే సయ్యద్ యూసుఫ్ కు తమ సొంత నిధులు 25000 అందజేసి వైద్య ఖర్చులకు ఉపయోగించుకోవాలని ఆయనకు సూచించారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సయ్యద్ ఇసుఫ్ కు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం వచ్చే అవకాశం ఉన్న అవన్నీ తప్పకుండా ఇప్పిస్తామని మంత్రి ఆయనకు యూసుఫ్‌కు తెలిపారు.

## క్రియాశీలక సభ్యుల సమావేశం.

మైదుకూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



బిజెపి పార్టీ కార్యాలయం లో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పురందేశ్వరి ఆదేశాల మేరకు అసెంబ్లీ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు అధ్వర్యంలో క్రియా శీలక సబ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశం లో బీజేపీ పార్టీ రాజకీయాలలో వారసత్వం, అవినీతి, స్వార్థం లేకుండా ప్రజాస్వామ్య బద్దంగా 2047 కి భారత దేశం అభివృద్ధి చెందిన వికసిత్ భారత్ గా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కృషి పట్టుదలతో ఎన్నో విజయాలను ప్రజలకు అందించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, మైదుకూరు అర్బన్ అధ్యక్షులు వడ్ల దేవేంద్ర, ఖాజేపేట మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, చాపాడు మాజీ మండల అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి, బి మఠం మండల నాయకులు చంద్ర ఓబులరెడ్డి, సీనియర్ నాయకులు, బీజేపీ సభ్యులు పాల్గొని చర్చించడం జరిగింది.

## ఎంఈసి, సిఈసి విభాగాలలో మాస్టర్స్ ఫలితాలు



ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :

శనివారం విడుదల అయిన ఇంటర్ మొదటి మరియు ద్వితీయ సంవత్సర ఫలితాలలో మాస్టర్స్ కాలేజీ నందు ఎంఈసి, సిఈసి విభాగాలలో లిఖిత్ ఫణి తేజ 489, ముబీస్ ఫర్హాత్ 479, లిఖిత 476, మునిచరణ్ 473, నందిని 468, దివ్య శ్రీ 468, అలాగే ద్వితీయ సంవత్సర ఫలితాలలో సాయి శ్రీ రక్షిత 980, నాగ ధను శ్రీ 980, అబ్దుల్ హమీద్ 848, చైతన్య 947, సానియా తబ్సుమ్ 947 మార్కులు సాధించారని వివరించారు ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థినీవిద్యార్థులను కాలేజీ ప్రిన్సిపల్ ముని భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు సంజీవ రాయుడు చంద్రశేఖర్ రెడ్డి, ముని శ్రీనివాసరెడ్డి, శర్మ మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## కారు ఈచర్ వాహనం డి

మదనపల్లి క్రైమ్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త.



ఈచర్ వాహనం, కారును ఢీకొన్న ప్రమాదం లో ఉపాధ్యాయురాలు మృతిచెందగా, ఆమె భర్త, కుమార్తెలు తీవ్రంగా గాయపడిన విషాదకర సంఘటన ఆదివారం మదనపల్లి, సరిహద్దుల్లో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయురాలు శారద (40) మృతి చెందగా, భర్త పి. వెంకటరమణ (45), కుమార్తె కీర్తి (16) లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కీర్తి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలకడ మండలం కు చెందిన పి.వెంకటరమణ, భార్య శారద లు కదిరిలో నివాసం ఉంటూ ములకలచెరువు మండలం లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. శనివారం ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల కావడంతో విజయవాడ లో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లారు. కుమార్తె కీర్తి ఇంటర్ వర్తీయులత కావడంతో సంతోషంతో తమిళనాడులోని ఓ ఆలయ దర్శనానికి వెళ్లారు. ఆదివారం తిరిగి కదిరికి వెళ్తుండగా పుంగనూరు, మదనపల్లి సరిహద్దులోని సుగాలి మిట్ట వద్ద ఎదురుగా వస్తున్న టీచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో వారిని 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స కొనసాగిస్తుండగా శారద మృతి చెందింది. మిగిలిన ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని బెంగళూరుకి తరలించారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం మార్చురీకి తరలించారు.



## బంగారు దుకాణంలో చోరీ..

ఖాజీపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

ఖాజీపేటలో దొంగల స్వైర విహారం కొనసాగుతోంది. గత కొద్దికాలంగా ఖాజీపేటలో వరుస దొంగతనాలతో దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తాజాగా ఖాజీపేట పట్టణ నడిబొడ్డున బస్టాండ్ సమీపంలో పంచాయతీ కాంప్లెక్స్ సందులో ఉన్న విఎస్ జ్యువెలరీ షాపు నందు దొంగలు చోరీకి తెగబడ్డారు. ఖాజీపేటకి చెందిన షేక్ షాహిద్ అనే వ్యక్తి పంచాయతీ కాంప్లెక్స్ సందులో గల కొద్ది సంవత్సరాలుగా బంగారు దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం అర్థరాత్రి సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి తాళాలు పగలగొట్టి షాపులో ప్రవేశించి, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి షాపులో ఉన్న నాలుగు కిలోల వెండి మరియు 15గ్రాముల బంగారు ఆభరణాలు దొంగలించారు. బంగారు ఆభరణాలు దాచే లాకర్ తెరిచే యత్నం చేయగా అది తెరుచుకోక పోవడంతో అందుబాటులో ఉన్న వెండి, చిన్న చిన్న బంగారు వస్తువులను దొంగలించుకొని వెళ్లారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కడప నుండి క్లూస్ టీం ను రప్పించి వేలిముద్రలు, ఆధారాలు సేకరించే యత్నం చేశారు. షాపులోని సీసీ ఫుటేజ్‌లను గమనించగా దొంగలు పూర్తిగా ముసుగులు ధరించి చోరీకి వచ్చారు. దీంతో దొంగలను గుర్తించడం కష్టసాధ్యంగా మారింది. షాపు ఓనర్ షాహిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, త్వరలో దొంగలను గుర్తించి చోరీ సొత్తును రికవరీ చేస్తామని సీఐ మోహన్ తెలిపారు.

## మత సామరస్యం,పరమత సహనం నేటి ఆవశ్యక

వేంపల్లి: ఏప్రిల్ 13 (ప్రభాత వార్త):



మతోన్మాదం మానవాళికి క్యాన్సర్ లా పట్టుకుందని, దీనిని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం వుందని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి అన్నారు. ఆదివారం విజయవాడ లో,సిద్ధార్థ ఆడిటోరియం లో మత సామరస్యం పై జరిగిన జాతీయ సదస్సులో తులసి రెడ్డి ఆత్మీయ అతిథి గా పాల్గొన్నారు.మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ 3 వేల సంవత్సరాల క్రితం మతాలే లేవన్నారు. క్రీస్తు పూర్వం 800 సంవత్సరాల క్రితం హైందవ మతం,క్రీస్తు పూర్వం 3వందల సంవత్సరాల క్రితం బౌద్ధ మతం, క్రీస్తు శకం 400 సంవత్సరాల క్రితం జైన మతం,క్రీస్తు శకం 600 సంవత్సరాల క్రితం ఇస్లాం మతం,క్రీస్తు శకం 15 వ శతాబ్దం లో సిక్కు మతం,క్రీస్తు 1800 లో క్రైస్తవ మతం ఆవిర్భావించాయని తులసి రెడ్డి అన్నారు.మతోన్మాదం దేశ సమైక్యతకు,సమగ్రతకు ప్రమాదకరమని అన్నారు. ఈ సమావేశంలో రాజ్య సభ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్ ఘడి,సుప్రీం కోర్టు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్,విజయా రావు, శ్రీనివాస రావు,అజీజ్ పాసా, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నెమలి వాహనంపై గంగా రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 13, ప్రభాత వార్త:



రామేశ్వరం లోనిశ్రీ రాజ రాజేశ్వరి దేవి సమేత శ్రీ ముక్తి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం ఉదయం 7 గంటలకు కలశ పూజ, హోమము, అనంతరం ప్రసాద వితరణ, సాయంత్రం గంగా రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ ముక్తి రామలింగేశ్వర స్వామి వారికి నెమలి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. అనంతరం రాత్రి రామేశ్వరం పుర వీధుల్లో మేళతాళాలు, మంగళ వాయిద్యములతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి.

రైల్వే కోడూరు ఏప్రిల్ 13 ప్రభాత వార్త...



రైల్వే కోడూరు మండలంలోని ఎస్ ఉప్పరపల్లి వద్ద ప్రమాదవశాస్తూ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు మృతి చెందిన వ్యక్తి 25 సంవత్సరాలు ఉంటాయని అయితే మృతి చెందిన వ్యక్తి రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన వాడు కాదని రైల్వే పోలీసులు తెలిపారు రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

## ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై దాడి అమానుషం

రైల్వేకోడూరు ఏప్రిల్ 13 ప్రభాతవార్త...

నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీలో బల పరిచిన రైల్వేకోడూరు నియోజకవర్గ జనసేన పార్టీ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ పై ఎన్ డి ఏ కూటమి నాయకులు గొడవలు చేయడం అమానుషమని ఈ దాడులను పూర్తిగా ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పండుగల మణి ఆవేదన వ్యక్తం చేశారు ఎన్డీఏ కూటమి పార్టీ నాయకులలో ఏదైనా మనస్పర్ధలు ఉంటే ఆ పార్టీలకు చెందిన ముఖ్యమైన రాష్ట్ర నాయకత్వాన్ని పిలిపించుకొని మాట్లాడుకోవాలి కానీ ఒక దళిత ఎమ్మెల్యే అని చూడకుండా గౌరవం లేకుండా వీధి రౌడీల్లాగా పొట్లాడుకోవడం ఎన్డీఏ కూటమిలో ఒక సీనియర్ నాయకుల రాజకీయ భవిష్యత్తుకు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని మణి దోస్తం పలికారు భవిష్యత్తులో ఇలాంటి గొడవలు పునరావృతం కాకుండా తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కూర్చొని ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వాన్ని కించపరిచేటట్టు చేసుకోకుండా నియోజకవర్గంలో అభివృద్ధి బాట చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మొగిలి వినయ్, ఎం జయరామయ్య, మల్లిక, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఈస్టర్ పండుగ వేడుకలు

దువ్వూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

స్థానిక దువ్వూరు చర్చి నందు ఈస్టర్ పండుగ సందర్భంగా క్రైస్తవ సోదరులు ఆదివారం మట్టల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగు గంగ బంగ్లా వద్ద నుంచి ఈత చెట్లకు చెందిన మట్టలు పట్టుకొని పాస్టర్ రెవరెండ్ రాజా ఆధ్వర్యంలో సంఘస్తులు ఏసన్న జయం..జయం అంటూ ఏసు క్రీస్తు నామ సమర్పన చేశారు. ఈసందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అలాగే వివిధ గ్రామాల నుంచి క్రైస్తవ సోదరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## విద్యావాన్ల కేంద్రంకు 20 వీల్ చైర్స్ వితర

వేంపల్లి: ఏప్రిల్ 13 (ప్రభాత వార్త):

భవిత దివ్యాంగుల విద్యా వనరుల కేంద్రం నందు కడప రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సమితి వారి ఆధ్వర్యంలో రెండు లక్షలు విలువ గల 20 వీల్ చైర్స్ ని 5 మండలముల దివ్యాంగ చిన్నారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రెసిడెంట్ నజీర్, ఎంఈఓ 1 జాఫర్ సాదిక్, ఎంఈఓ 2 స్టాలిన్ ఐజాక్ పాల్గొన్నారు. గత 20 సంవత్సరాల నుంచి ద కడప రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సమితి కడప వారి ఆధ్వర్యంలో సొసైటీ ద్వారా దాదాపు రాయలసీమలో వీల్ చైర్లు, మినరల్ వాటర్ ప్లాంట్స్ , కేజీబీవీ పాఠశాలల పిల్లలకి నోటు పుస్తకములు, కుట్టుమిషన్ సెంటర్లు అందిస్తున్న నజీమ్ గారిని ఎంఈఓ 1 ,2 లు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను చూసి బాధపడకండి ఈ పిల్లలు దేవుళ్ళతో సమానం, దివ్యాంగ చిన్నారులను ఎక్కడికైనా తీసుకెళ్లడానికి వీల్ చైర్స్ చాలా ఉపయోగపడతాయి అని ఎన్జీవో నజీర్ చెప్పడం జరిగింది.అదేవిధంగా త్వరలో బిడాల మిట్టలో టైలరింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్జీవో నజీర్ తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు. అదేవిధంగా వివిధ మండలాల నుంచి వచ్చిన ఏఈఆర్టీ ల పనితీరు చక్కగా నిర్వహిస్తున్నారని ఫిజియోథెరపీ క్యాంపు చక్కగా దోహదం చేస్తున్నాయని ఎంఈఓ 2 అన్నారు. అనంతరం అతిధులను భవితా కేంద్ర సిబ్బంది ఘనంగా సత్కరించడం జరిగింది. 150 మందికి పైగా పాల్గొన్న దివ్యాంగ చిన్నారులు, తల్లిదండ్రులకి భోజన వసతిని ఎన్జీవో నజీర్ ఏర్పాటు చేయడం జరిగింది. ఐ ఈ ఆర్ పి లు వేంపల్లి మండలం నుండి యశోద, సుజాత వేముల మండలం, కరుణాకర్ , మాధవి, ఎర్రగుంట్ల రవి, కొండాపురం రాంబాబు, తేజస్విని వి.యన్ పల్లి ప్రశాంతి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



## ఆపదలో ఉన్న వ్యక్తికి ఆర్థిక సాయం



జమ్మలమడుగు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

పేదలకు సహాయ సహకారాలు సేవా కార్యక్రమాలు చేయడంలో మానవతా సేవా సంస్థ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని సంస్థ అధ్యక్షులు నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జమ్మలమడుగు పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన రాజు అనే వ్యక్తికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం జరిగింది. ఈ వ్యక్తికి ఆపరేషన్ కోసం దాతల సహకారం కోరారు. మానవతా సంస్థ జమ్మలమడుగు వారిని కూడా అడగడంతో మానవతా సేవా సంస్థ నుంచి రూ.వేలు, దాతల నుంచి రూ.8800 కలిపి రూ.13500 (రాజు స్నేహితులు సుభహాన్ భార్యకు) అందజేయడం జరిగింది. ఎవరైనా మానవతా సభ్యులు కూడా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ గౌరవ సభ్యులు ధనిరెడ్డి ఓబులరెడ్డి, మస్తాన్‌రెడ్డి, తిరుపతయ్య, ఎస్.రామ్మోహన్‌రెడ్డి, శ్రీధర్, నరసింహులు, మానవతా సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి మృతి

జమ్మలమడుగు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

మైలవరం మండలం వద్దిరాల గ్రామానికి చెందిన సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకొని మృతదేహం వద్ద మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తగలబడిన ప్రొద్దుటూరు మున్సిపాలిటీ కంపోస్టు యార్డ్

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను నిల్వ ఉంచిన దాదాపు 20 ఎకరాల్లో ఉన్న కంపోస్టు యార్డ్ మంటల్లో ఆదివారం ఆహుతైంది. పెద్దఎత్తున మంటలు ఎగసిపడడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించకపోతే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్నిమాపక అధికారులతో మంటలు అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న యువనేత

పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్ 13ప్రభాతవార్త:

ఉప్పులూరు బ్రిడ్జి గత ఏళ్ల సంవత్సరాల నుండి సగిలేరు మీద బిడ్జి లేక ఉప్పలూరు సాగిలేరు నిరు ఉన్నపుడు ఇబ్బంది పడుతున్నారు. ఆ బిడ్జి కి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ టిడిపి యువ నాయకులు రితేష్ కుమార్ రెడ్డి పాల్గొని కొబ్బరికాయ కొట్టి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రితేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పులురు బ్రిడ్జిని త్వరితగతిన పూర్తి చేసి మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థ అందిస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. గత నెసిపి



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రితీష్ కుమార్ రెడ్డి

## ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత

జమ్మలమడుగు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:





జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామంలోని కేజీబీవీ లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్స్ 2వ ఏడాదిలో 24 మందికి 24 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ ప్రణీత తెలిపారు. మొదటి సంవత్సరం 26 మందికి 25 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. మొదటి ఏడాది విద్యార్థి ఎం. నాగతేజ్వరి481/500 మార్కులు సాధించినట్లు తెలిపారు. 2వ సంవత్సరం విద్యార్థిని సి.సాయి దిల్షాద్ 948/1000 మార్కులు సాధించడం జరిగిందన్నారు.

## విభ క్రికెట్ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించేందుకు హాజరుకావాలని మంత్రికి ఆహ్వాన పత్రిక

రాయచోటి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త

రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారికి ఆదివారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈనెల 23వ తేదీ విభా క్రికెట్ స్పోర్ట్స్ అకాడమీని తమ చేతుల మీదుగా ప్రారంభించాలని మంత్రివర్యులకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... రాయచోటి పట్టణంలో విభా క్రికెట్ స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేయడం ఎంతో శుభ పరిణామమని ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి తప్పకుండా హాజరవుతానని క్రికెట్ స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులకు మంత్రివర్యులు తెలిపారు.

## నందలూరు బీజేపీ నేత మస్తానయ్య మృతి

రాజంపేట అర్బన్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త



బీజేపి నాయకుడు, నందలూరు రైల్వే ఉద్యమ నాయకుడు మస్తానయ్య ఆకస్మిక మృతి చెందారు. శనివారం అర్ధరాత్రి గుండె పోటుతో ప్రస్తానయ్య కన్ను మూసినట్లు సమాచారం. మస్తానయ్య మృతి పట్ల పలువురు బిజెపి ,టిడిపి ,జనసేన నేతలు సంతాపం వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్ రెడ్డి,బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్, నియోజవర్గ నేత పోతుగుంట రమేష్ నాయుడు, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబూ సూర్యనారాయణ, జనసేన పార్లమెంట్ నియోజకవర్గ నేత యల్లటూరు శ్రీనివాసరాజు, ఇంకా పలువురు నేతలు సంతాపం చేశారు. ఆదివారం ఆయన అంత్యక్రియల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మట్టల ఆదివారం పండగ

ముద్దనూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



గుడ్ ఫ్రైడే(శుభ శుక్రవారం) ముందుగా వచ్చే ఆదివారం రోజున మట్టల ఆదివారం పండుగ(పామ్ సండే)సందర్భంగా మండలంలోని క్రైస్తవులు ఆయా చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ఉత్సాహంగా ప్రత్యేక గీతాలు ఆలపిస్తూ మట్టలు చేత పట్టుకొని వీధుల్లో తిరిగారు. స్థానిక ముద్దనూరు పట్టణంలోని సిఎస్ఐ(ఎస్పిజి),ఆర్ సిఎం చర్చిల్లో రెవరెండ్ జెడి వినయ్ కుమార్, రెవరెండ్ ప్రసన్న సంతోష్ కుమార్, ఫాదర్ మరిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఎల్ ఎమ్ కాంపౌండ్ లోని సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ జెడి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలు చేత పట్టుకుని ప్రత్యేక గీతాలు ఆలపిస్తూ ఊరేగింపుగా తిరిగి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మట్టల ఆదివారం పండుగ (పామ్ సండే) యొక్క ప్రాముఖ్యతను క్రీస్తు చేసిన బోధనల గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు, మహిళలు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పేదలు ఆక్రమణ స్థలం క్రమబద్ధీకరించుకోవాలి

రాజంపేట అర్బన్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త

పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆక్రమణ క్రమబద్ధీకరణ పథకం వరం లాంటిదని రాజంపేట తాసిల్దార్ పీర్ మున్ని పేర్కొన్నారు. దారిద్రరేఖ దిగువన ఉన్న పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం జీవో 30 జారీ చేసిందని తెలిపారు.150 చదరపు గజాలు లోపు ఆక్రమించుకున్న వారు ఉన్నట్లయితే ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరించుకునేందుకు గతంలో ఎప్పుడు ప్రభుత్వ స్థలం తీసుకుని ఉండకూడదని అన్నారు. అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులకు ఇంతకంటే మంచి అవకాశం రాదన్నారు.

## ట్రిబుల్ ఐటీలో జీవో నెంబర్ 74 అమలు చేయాలి

ఎడ్యుకేషన్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

ట్రిబుల్ ఐటీ లో స్పోర్ట్స్ కోట విద్యార్థులకు 2 రిజర్వేషన్ ఉండగా 0.5 రిజర్వేషన్ మాత్రమే కల్పిస్తూ స్పోర్ట్స్ కోట విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు, అని తక్షణమే 74 జీవో అమలు చేయాలి అని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ డిమాండ్ చేశారు రాష్ట్రవ్యాప్తంగా యూత్ అడ్వాన్స్మెంట్ టూరిజం కల్చర్ క్రీడలు శాఖ 9.8.2012 74 జీవో ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ శాఖలు,విద్యాసంస్థలు ,స్థానిక సంస్థలు, కార్పొరేషన్ బోర్డులు, అధికారులు, గ్రంథాలయ సంస్థలు, మార్కెట్ కమిటీలు మరియు ఇతర ప్రభుత్వాల ద్వారా నిధులు మంజూరు చేయబడి అన్ని స్థాయిలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రెండు శాతం 2 స్పోర్ట్స్ కోట రిజర్వేషన్ ఉంటుందని ప్రభుత్వం తెలియజేసింది, అయితే రాయలసీమ లో ఉన్న ఒకే ఒక్క ట్రిబుల్ ఐటీ లో కేవలం 0.5 స్పోర్ట్స్ క్రీడాకారులకు రిజర్వేషన్ అమలు అవుతుందని 200 విద్యార్థులలో ఒక్క సీటు మాత్రమే వర్తిస్తుందని అయితే 74 జీవో అమలు అయితే 100 కు 2 సీట్లు అమలు అవుతాయని స్పోర్ట్స్ కోటా విద్యార్థులకు న్యాయం జరుగుతుందని తెలిపారు, ,చెవుడు, హ్యాండీక్యాప్ ఇటువంటివి లేకపోయినా సంబంధిత డాక్టర్ల దగ్గర సదరం సర్టిఫికెట్లు తెచ్చుకొని దొంగ దారిలో కొంతమంది విద్యార్థులు సీట్లు పొందుతున్న వారికె ప్రిఫరెన్స్ ఇస్తున్నారని వారు తెలియజేశారు, తక్షణమే కూటమి రాష్ట్ర ప్రభుత్వం కడప జిల్లా ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీ కళాశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి స్పోర్ట్స్ కోట విద్యార్థులకు 74 జీవో ప్రకారం 2 రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలని అదేవిధంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రీడాకారులకు 3 రిజర్వేషన్ ఇస్తామని ఇంతవరకు జీవో వదల్లేదు తక్షణమే దీనిని కూడా ఇంప్లిమెంట్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

కలకడం ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



పూర్వ విద్యార్థులు అపూర్వ కలయికతో కలుసుకోవడం జరిగింది. మండలంలోని బాటవారిపల్లెలో ఉన్న విశ్వ జ్యోతి హైస్కూల్లో 2011, 12వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ అపూర్వ కలయికతో ఒకచోట చేరి తాము చదివిన విషయాలను నెమరు వేసుకున్నట్టు తెలిపారు. పెద్దలను గౌరవించడం మర్యాదగా పలకరించడం వంటి విషయాలను నేర్పిన ఉపాధ్యాయులను దుశ్యాలవాలు పూలమాలలతో వారిని ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకొని పండుగ వాతావరణం ఎలా గెట్ టుగెదర్ ప్రోగ్రాం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు కొనియాడారు. ఈ విద్యార్థుల అపూర్వ కలయికలో ఉపాధ్యాయులు గంగోత్రి నాయుడు, రెడ్డప్పరెడ్డి, కుమార్ నాయుడు, బాబ్జాన్, రఫీ, సయ్యద్ భాష, హసన్, హుస్సేన్, హైమావతి, నాగరత్న ,మొదలగు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

పెద్దమండెం ఏప్రిల్ 13 ప్రభాతవార్త



మండలంలోని కలుచర్లలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన సంఘట నలో పెద్దమండెంలో చోటు చేసుకుంది పెద్దమండెం ఎస్సై పివి రమణ వివరాల మేరకు కనిచర్లలో ఆదివారం పోలేరమ్మ తిరుణాలకు బి కొత్తకోట మండలం బండమీద పల్లి కు చెందిన భాస్కర్ రెడ్డి 17 తన స్నేహితుడైన రాజశేఖర్ ఇంటికి శనివారం రాత్రి వచ్చారు ఆదివారము ఉదయం తన స్నేహితులతో కలిసి కలిశాల సమీపంలోని పాపిరెడ్డి చెరువుకు ఈతకు వెళ్లారు అక్కడ ఈత ఆడుతూ చెరువు లోపలికి వెళ్లారు ఈత వచ్చినప్పటికీ దూరం వెళ్లడంతో తిరిగి రావడంతో జాప్యం కావడంతో ఊపిరాడక చెరువులో మునిగిపోయారు దీంతో స్థానికుల సహాయంతో విద్యార్థిని బయటకు తీశారు అనంతరం పోస్టుమార్టంకు మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కంభం పాములేటికి నటభూషణ బిరుదు ప్రధానం

ప్రొద్దుటూరు ఏప్రిల్ 13 ప్రభాతవార్త



శ్రీ చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ కళా సంస్థ అధ్యక్షులు కంభం పాములేటికి ప్రొద్దుటూరు చదువుల సాహిత్య కళావేదిక మరియు బాల సాహిత్య సాంస్కృతిక సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఆదివారం నటభూషణ బిరుదు ప్రధానం చేశారు. గత 42 సంవత్సరముల నుండి నాటక రంగంలో కంభం పాములేటి చేసిన సేవలను గుర్తించి స్థానిక మున్సిపల్ హై స్కూల్ ఆవరణలోని శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు శాఖ గ్రంథాలయంలో బిరుదు ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి కథా రచయితలు డికె చదువుల బాబు జింక సుబ్రమణ్యం బిసి సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మట్టల ఆదివారం పండుగ వేడుకలు

పొద్దుటూరు ఏప్రిల్ 13 ప్రభాతవార్త



జెరూసలేంలోకి ఏసు క్రీస్తు ప్రభువు వెళ్లిన సందర్భంలో అక్కడి ప్రజలు ఈత మట్టలను దారి గుండా పరిచి ఆహ్వానించిన సందర్భంగా ఈ మట్టల ఆదివారం ను జరుపుకుంటారని రెవరెండ్ కోలాటి రాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని గోకుల్ నగర్ లో ఉన్న ఎస్పీజీ చర్చి 2లో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చ్ ఫాదర్ రెవరెండ్ కోలాటి రాజు మాట్లాడుతూ ఇది పవిత్ర వారం ప్రారంభాన్ని సూచిస్తుందనీ, చర్చి యొక్క అత్యంత గంభీరమైన వారంలో గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ కూడా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ విశ్వాసులు చర్చి సంఘ పెద్దలు ఈత మట్టలను చేత పట్టుకుని చర్చి చుట్టూ ప్రదక్షణ చేసి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

## జ్యోతుల ఉత్సవాల్లో అపశృతి

ముద్దనూరు ,ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

మండలంలోని ఉప్పలూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి జ్యోతుల ఉత్సవాల్లో ప్రమాదవశాత్తు టపాసుల నిప్పులు గడ్డివామీపై పడి గడ్డివామీ దగ్నమైందని గ్రామస్తులు తెలిపారు. వివరాల్లోకి వెళితే ఉప్పలూరుకి చెందిన అట్లా జగదీశ్వర్ రెడ్డి పశువుల కోసం తన కలంలో గడ్డివామును నిల్వ చేసుకున్నాడు. జ్యోతుల సందర్భంగా బాణా సంచాలు కాల్చుతుండగా గాలికి నిప్పురవ్వలు గడ్డివాముపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలంటుకున్నాయి. స్థానికులు జమ్మలమడుగు ఫైర్ స్టేషన్‌కి సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు సుమారు 50 వేల రూపాయలు నష్టం వాటిలిందని బాధితుడు వాపోయారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు, గ్రామస్తులు, ఊపిరి పీల్చుకున్నారు.

## మానవతా స్వచ్ఛంద సేవా సంస్థకు విరాళం

లక్కిరెడ్డిపల్లి : ఏప్రిల్ 13 ప్రభాత వార్త



ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు, మానవతా కేంద్ర కమిటీ సభ్యులు వై. ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు సాయి తేజ యాదవ్ లు కలసి మానవ స్వచ్ఛంద సేవా సంస్థ లక్కిరెడ్డిపల్లి యూనిట్ కు 50వేల రూపాయల చెక్‌ను విరాళంగా మానవతా చెర్మెన్ బాల సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు షఫీ నాయక్, కో చేర్మెన్ శివ శంకర్ రెడ్డి, కన్వీనర్ శివయ్య, జిల్లా సభ్యులు కృష్ణ చైతన్య రెడ్డి, కోశాధికారి రవి శంకర్, డైరెక్టర్ రమణా రావు, బండపల్లి శ్రీనివాసులు, సాయి చరణ్ యాదవ్, టైలర్ రవి లకు అందచేశారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యులు ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మానవతా వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మానవ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్రవ్యాప్తంగా అనేక ఉచిత సేవా కార్యక్రమాలు బాడి ఫ్రీజర్స్, శాంతి రథాలు, అంబులెన్స్, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, ప్రమాదంలో ఉన్న వారిని ఆదుకోవడం, ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు లాంటి ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. చైర్మన్ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవతా సభ్యులుగా చేరడానికి 600 రూపాయలు చెల్లించి సభ్యులుగా చేరాలన్నారు. లక్కిరెడ్డిపల్లి మానవతా సేవా కార్యక్రమాల కోసం 50,000 విరాళం అందజేసిన ప్రసాద్ యాదవ్ కు సాయితేజ యాదవ్ కు అభినందనలు తెలియజేశారు. మానవతా మండల అధ్యక్షుడు ఎస్.ఎం.డి షఫీ నాయక్ మాట్లాడుతూ త్వరలోనే మానవత శాశ్వత బిల్డింగ్ కు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా చిన్నరెడ్డెప్ప

పీలేరు ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా పీలేరుకు చెందిన న్యాయవాది వల్లెపు చిన్న రెడ్డెప్ప నియమితులయ్యారు. ఆదివారం పీలేరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతకుమార్ మాట్లాడుతూ బార్ కౌన్సిల్ కేవలం సేకరించడం నిధులపై పెత్తనం చెలాయించే విధానాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన లాయర్లకు రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అమలు చేయాలన్నారు. న్యాయవాదులకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా తోట ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా రవీంద్రరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా దినకర్, శ్రీకాంత్, ఈసీ సభ్యులుగా బాలసుబ్రహ్మణ్యం, గంగులయ్య, నిరంజన్, మొహ్మద్ ఆలీ, రెడ్డిశేఖర్ నియమితులయ్యారు. కార్యక్రమంలో ఈ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### బస్టాండ్ వద్ద తొలగించని రూములు

## పట్టా భూములా లేక ప్రభుత్వ భూములా

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త



మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని మైదుకూరు రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద తొలగించని రూములు పట్టా భూములా లేక ప్రభుత్వ భూములా తహసీల్దార్ స్పష్టం చేయాలని ఎంపిపి శేఖర్ యాదవ్ కోరారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్తపల్లి పంచాయతీ పరిధిలో రోడ్డు విస్తరణలో జరిగిన అవినీతి గురించి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు ప్రశ్నిస్తే అక్కడి సర్పంచ్ శివచంద్రారెడ్డి తమకు సమాధానం ఇవ్వకపోగా రాచమల్లు పై గత 5 సంవత్సరాలుగా చేసిన విమర్శలే చేయడం హాస్యాస్పదమన్నారు. ఆ విమర్శలలో నిజమైతే ఈ 10 నెలల టిడిపి పాలనలో విచారణ జరిపించారా, జరిపిస్తే ఆరోపణలు నిజమయ్యాయో లేదో తెలపాలన్నారు. కొత్త బస్టాండ్ వద్ద ఉన్న శివ చంద్రారెడ్డి గదుల స్థలం ఆర్ఎస్ఆర్ ప్రకారం 1561బి, 154 సర్వే నెంబర్లలో భూమి ఎవరి పేర్లు చూపటం లేదని, మరి తహసీల్దార్ ఏ విధంగా పట్టా భూమని అన్నారో తెలపాలన్నారు. అది ప్రభుత్వ భూమా లేదా పట్టా భూమా అని తమకు ఆధారాలు చూపాలని తహసీల్దార్ ని కోరారు. తెలపని పక్షంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణులు నిరాహార దీక్షకు సిద్ధమన్నారు. రాచమల్లు పై అవినీతి ఆరోపణలు నిరూపించాలని డిమాండ్ చేశారు. ఉనికి కోసం ప్రాకులాడేది ఎవరో ప్రొద్దుటూరు ప్రజలకు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో సోములవారిపల్లె వైసీపీ నాయకులు గోటూరు వెంకటేష్, నాయకులు నల్లదేసి జంగమయ్య పాల్గొన్నారు.

## క్రమశిక్షణకు మారుపేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

కలకడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త:



క్రమశిక్షణకు మారుపేరుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నిలిచిందని ప్రిన్సిపాల్ జయ భారతి, వైస్ ప్రిన్సిపాల్ రమణయ్య లు తెలిపారు.మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025, 26వ సంవత్సరానికి జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు.ప్రథమ సంవత్సరంలో ఈ ఏడాది73 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 50 మంది ఉత్తీర్ణులై 68 సాధించడం జరిగిందన్నారు.అలాగే ద్వితీయ సంవత్సరంలో 50 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 80 శాతం సాధించడం జరిగిందన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ చదువుతున్న టీ.సౌజన్య 451 మార్కులు, డి.భావన 442 మార్కులు సాధించే ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ చదువుతున్న ఎం.గణేష్ 950 మార్కులు సాధించి ప్రథమ స్థానం లో నిలవగా, సి.గుణశేఖర 838 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలవడం జరిగిందని వారు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చిన ఫలితాలు ఆధారంగా ఉత్తీర్ణులైన విద్యార్థులను అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె ఏప్రిల్ 13 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలం లోని ఎస్సీ కులానికి చెందిన లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎస్సీ రుణాలకు ఈనెల 14వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు అర్హులైన లబ్ధిదారులు ఏపీఓబి ఎం ఎం ఎస్ వెబ్సైట్ నందు ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మండలం ఎస్సి లబ్ధిదారులు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాన్ని పొంది ఆర్థిక అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు.

## మొదటి స్థానంలో వేంపల్లి ఉర్దూ జూనియర్ కాలేజీ

వేంపల్లి ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



శనివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో వేంపల్లి ఉర్దూ జూనియర్ కళాశాల సెకండ్ ఇయర్ పాస్ శాతం 97 లో రావడంతో మొదటి స్థానంలో నిలిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రవి పేర్కొన్నారు. సెకండ్ ఇయర్ ఇంటర్ ఫలితాలలో 97 శాతం ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరం లో 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. వాటి లో ఎంపీసీ గ్రూప్ లో సయ్యద్ ఇమాంబీ 957/1000 బైపీసీ లో షేక్ మోబినా 950/1000 సీఈ సీ లో షేక్ ఫమీహ 921/1000 హెచ్ ఈ సి లో షేక్ సమీరా 608/1000 మార్కులు సాధించారన్నారు. ఫస్ట్ ఇయర్ ఇంటర్ లో ఎంపీసీ గ్రూప్ లోషేక్ నఫీసా417/470 బైపీసీ లో షేక్ నూరజహాన్ 425/440 సి ఈ సి లో కే ఎస్ సమీరా 452/500 హెచ్ ఈ సి లో షేక్ మిస్ భా 362/500 మార్కులు సాధించారన్నారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అలాగే ఈ ఫలితం కోసం కృషి చేసిన అధ్యాపక బృందానికి ప్రిన్సిపాల్ రవి అభినందనలు తెలిపారు.

**అడ్మిషన్లు ప్రారంభం.** అలాగే మొదటి సంవత్సరంలో అడ్మిషన్ లు జరుగుతున్నవి. కావున S.S.C వ్రాసిన విద్యార్థులు ఉర్దూ మరియు ఇంగ్లీష్ మీడియం లలో కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చు. వారికి బ్రిడ్జి కోర్సులు పైన టీచింగ్ ఇవ్వబడుచున్నది. మైనారిటీ విద్యార్థులే కాక జెనరల్ లో ఇంగ్లీష్ మీడియం చదివిన విద్యార్థులు కూడా చేరవచ్చని ప్రిన్సిపాల్ రవి ఒ క ప్రకటనలో తెలియజేశారు.

## మాజీ సైనికుని కుటుంబానికి న్యాయం జరగాలి

వాల్మీకిపురం ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



జిల్లాలోని వాల్మీకిపురం మండలం మూరేవాండ్లపల్లి గ్రామం పెద్దవంకపల్లికి చెందిన మాజీ సైనికుడు చంద్రగిరి లక్ష్మన్న కుమారుడు వెంకటాద్రి రెవెన్యూ అధికారుల వేదింపులతో ఆత్మహత్యకు పాల్పడి అకాల మరణంచెందారు. తన మృతికి స్థానికులు, రెవెన్యూ అధికారుల వేధింపులే కారణమని సుసైడ్ నోట్ రాసిపెట్టాడు. ఈ సందర్భంగా మాజీ సైనికుని కుటుంబానికి ప్రభుత్వం స్పందించి వెంటనే న్యాయం చేయాల్సిన అవసరం ఉందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వెంకటాద్రి ఆత్మహత్య చేసుకుని పది రోజులు గడుస్తున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు మృతుని కుటుంబానికి న్యాయం చేయక పోగా బాధిత కుటుంబానికి అండగా నిలిచిన మాజీ సైనికుల సంక్షేమ సంఘం నేతలపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయడం దారుణమన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని శాంతియుత నిరసన తెలియచేసిన మాజీ సైనికుల సంక్షేమ సంఘంపై పోలీసులు నమోదు చేసిన కేసును ఉప సంహరించుకోవడంతో పాటు వెంకటాద్రి కుటుంబానికి నష్టపరిహారం, ఐదెకరాల భూమిని కేటాయించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

## గంగమ్మ తల్లి దేవస్థానమునకు విరాళం



కురబలకోట ఏప్రిల్ 13 ప్రభాతవార్త

మాదికనుమ వాస్తవ్యులు కీర్తిశేషులు గుర్రాల రెడ్డమ్మ కీర్తిశేషులు చిన్న రెడ్డి మనవడు జ్ఞాపకార్థం 1,00,116 శ్రీ పాలేటి గంగమ్మ తల్లి దేవస్థానమునకు అడ్వకేట్ జిఎం రెడ్డి మాది కనుమ చందా రూపములో ఆలయ ధర్మకర్త పూజారి అంజికి అందజేశారు. అడ్వకేట్ జిఎంరెడ్డికి అమ్మవారి మీద ఎంతో భక్తి. అమ్మవారి మీద ఎంతో అపారమైన నమ్మకం. ఆలయ అభివృద్ధిలో తన వంతు పాత్ర ఉండాలని ఆశిస్తున్నాడు. ఇక్కడ ఒక పవిత్రమైన పుణ్యక్షేత్రం లాగా తీర్చి దిద్దాలని తన ఆకాంక్షాన్ని తెలియజేశారు. లాయర్ గా జి.ఎం రెడ్డి ఈ సమాజానికి మరియు ప్రజలకి ఎంతగానో సేవలందిస్తున్నాడు. వీరి కుటుంబమునకు అమ్మవారి కృపాకటాక్షములు ఎల్లవేళలా ఉండాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ముద్దనూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



మండలంలోని డిఎన్‌పల్లె గ్రామ సమీపంలో ఆటో ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు ఢీకొని యువకుడికి గాయాల అయినా ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కోసినేపల్లి గ్రామానికి చెందిన నందకిషోర్ యాదవ్ ద్విచక్ర వాహనంపై ముద్దనూరు వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో యువకుడికి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి నట్లు స్థానికులు తెలిపారు. వెంటనే స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి సిబ్బంది చేరుకొని వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వైద్యశాలకు తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

## నల్లారి కుటుంబం రుణం తీర్చుకోలేనిది

వాల్మీకి పురం ఏప్రిల్ 13 ప్రభాతవార్త:

నల్లారి కుటుంబం రుణం తీర్చుకోలేనిదని వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా నియమితులైన కోసూరి చంద్రమోళి పేర్కొన్నారు. ఆదివారం కలికిరిలో మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం నల్లారి కిరణ్ మార్కెట్ చైర్మన్ చంద్రమోళి ని అభినందించారు. అనంతరం నూతన మార్కెట్ చైర్మన్ చంద్రమోళి మాట్లాడుతూ దివంగత నల్లారి అమరనాథరెడ్డి కాలం నుండి కూడా తన తండ్రి కోసూరి నరసింహులు, అలాగే తమ కుటుంబం పట్ల నల్లారి కుటుంబీకుల ఆదరణ మరువలేనిదన్నారు.తనకు పదవి రావడం పట్ల ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవి పట్ల బాధ్యతతో పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, నాయకులు శేషాద్రి రెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కిరణ్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న చంద్రమోళి

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



రామసముద్రం,ఏప్రిల్ 13ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో 2012, 13 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.మరియు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని వారి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## గౌతమి పాలిటెక్నిక్ కళాశాలలో ఫేర్ వెల్ డే



ప్రొద్దుటూరు ఏప్రిల్ 13 ప్రభాతవార్త

మండల పరిధి లోని గౌతమి పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థినిలకు ఘనంగా ఫేర్వెల్ డేను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్ రావు తెలియచేశారు. విద్యార్థినులు తమ కళాశాలలో మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సును పూర్తి చేయడం సంతోషంగా వుందని అలాగే విద్యార్థినిలు ఇంకా ఉన్నత మైన కోర్సులను పూర్తి చేసి భవిష్యత్తులో మంచి స్థాయిని చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా బెంగళూరులోని రెసిడెన్సి యూనివర్సిటీ అసోసియేట్ డైరెక్టర్ ట్రిపుల్ ఈ విభాగ అధిపతి డాక్టర్ వై జోషి మనోహర్ హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సును పూర్తి చేసిన వారికి ప్రభుత్వ రంగ సంస్థల్లో మెరుగైన ఉపాధి అవకాశాలున్నాయని తెలిపారు. అలాగే ప్రైవేట్ రంగ సంస్థల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ మాట్లాడుదూ విద్యార్థినిలు క్రమశిక్షణతో మంచి నైపుణ్యం సాధించి జీవితంలో బాగా స్థిరపడాలని తెలియచేశారు. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ బాబమ్మ, కళాశాల డైరెక్టర్లు నాగూరు, రవీంద్రా రెడ్డి, కో డైరెక్టర్ శైలూష, ఇంజనీరింగ్ కళాశాల డాక్టర్ ఎం రామ సుబ్బమ్మ, వివిధ విభాగ అధిపతులు మహమ్మద్ జాబీర్, యాకూబ్ అలీ, కోటేశ్వర రావు, విజయమ్మ, అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్‌చే సర్పంచ్‌కు ఘన సన్మానం

మదనపల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



సర్పంచ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతిని ఘనంగా సన్మానించారు. ఆదివారం జిఆర్‌టి ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఎన్.మునిగోపాలక్రిష్ట అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కురవంక సర్పంచ్ చలపతిని శాలువ కప్పి మెమొంటో అందజేసి ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు, రాజకీయపార్టీలకు అతీతంగా గ్రామంలోచేపడుతున్న అభివృద్ధి పనులు పట్ల వారిని అభినందించారు. అనంతరం అధ్యక్షులు మునిగోపాల్‌క్రిష్ణ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ ఇస్మాన్‌సాహెబ్, మునిరత్నమయ్య, గొల్లపల్లె మారుతిరావు, అప్పినేపల్లి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు పాఠశాలకు పదిబస్తాల బియ్యం వితరణ

మదనపల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :



బియ్యం వితరణ చేస్తున్న దృశ్యం

అమ్మచెరువుమిట్ట సమీపంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలకు అప్పారావువీధిలోని పిఎన్. ట్రెడర్స్ యజమాన్యులు పిఆర్.నాగభూషణం, పి.సువర్ణలక్ష్మీల కుమారుడు శ్రావణ్‌కుమార్ 25కేజీల పదిబస్తాల బియ్యాన్ని ఆదివారం వితరణ చేశారు. వెలుగు పాఠశాలలోని వృద్ధులను ప్రేమతో పలకరించి వారికి చేస్తున్న సేవల పట్ల ఆయన యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం శ్రావణకుమార్‌కి వెలుగు స్కూల్ సెక్రటరీ ఎం.ఉదయమోహన్‌రెడ్డి శాలువతో సత్కరించి మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీనాకుమారి, సోషల్‌వర్కర్ గీత, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

## ఒంటరి జీవితం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

మదనపల్లి క్రైమ్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త.

ఒంటరి జీవితాన్ని భరించలేక ఓ వృద్ధుడు తన ఇంటి గుమ్మానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఆదివారం మదనపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి. మదనపల్లి పట్టణం దేవళం వీధికి చెందిన మృతుడు సయ్యద్ జాఫర్ హుస్సేన్ (70), భార్య షామీద జీవనోపాధి కోసం ముంబైకి వెళ్ళింది. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. సయ్యద్ భాషను కూడా గత కొంతకాలంగా ముంబైకి రావాలని కుటుంబ సభ్యులు కోరుతున్న ఆయన మదనపల్లిలోనే నివాసం ఉండేవాడు. ఇక్కడ ఒంటరి జీవితం భరించలేని సయ్యద్ జాఫర్ హుస్సేన్ మనస్థాపనతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం స్థానికులు సయ్యద్ జాఫర్ హుస్సేన్ తన ఇంటి గుమ్మానికి వేలాడుతూ కనిపించడంతో షాక్‌కు గురయ్యారు. వెంటనే వారు ఒకటవ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రి మార్చరికి తరలించారు. విచారణలో భాగంగా, సయ్యద్ జాఫర్ హుస్సేన్ గత మూడు రోజులుగా ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

## ఉచిత కంటి వైద్య శిబిరం

రైల్వే కోడూరు ఏప్రిల్ 13 ప్రభాత వార్త...

అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు పట్టణం శంకర నేత్రాలయ హాస్పిటల్ మిషన్ ఫర్ విజన్ చెన్నై వారిచే కాకతీయ హై స్కూల్ నందు టీవీ9 రమేష్ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరము జరిగినది 68 మంది కంటి పరీక్షలకు హాజరు కాగా వీరిలో 32 మంది ఆపరేషన్ కు ఎంపిక అయ్యారు వీరిని శంకర నేత్రాలయ చెన్నైకి తీసుకెళ్లి ఉచితముగా ఆపరేషన్ చేస్తారు వీరికి ఉచిత భోజనం రవాణా సౌకర్యం హాస్పిటల్ వారే కలిగిస్తారు ఆపరేషన్ చేయించుకున్న వారికి వారం తర్వాత శిబిరం జరిగిన వద్దనే డాక్టర్లు పరీక్షలు నిర్వహిస్తారు.



## ఇంటర్ ఫలితాలలో డా.బి జె యస్ ఆర్, సుభాష్

# గాయత్రి జూనియర్ కళాశాలల విద్యార్థుల మార్కుల జోరు



**బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన ఇంటర్మీడియేట్ ఫలితాలలో బద్వేల్ పట్టణం లోని డా .బి .జె.యస్.ఆర్. మరియు సుభాష్ గాయత్రి జూనియర్ కళాశాలల విద్యార్థులు సీనియర్ ఇంటర్ ఎంపీసీ. విభాగం లో పఠాన్ సాజిద్ 989/1000 టౌన్ ఫస్ట్, యం . శ్రీ కళ 981/1000, ఎస్. వి .కార్తీక్ నాథ్ రెడ్డి 980/1000,యన్ రామ మోక్షిత 978/1000, యం కిరణ్ 977/1000, యం. విష్ణు 976/1000, ఆర్ లిఖిత 975/1000 , ఎ . సుమంత్ కుమార్ రెడ్డి 972/1000 , యం. పూజిత 971/1000 యస్ . ఓజస్విత 971/1000, యం. చైతన్య గణేష్ 970/1000 మార్కులు సాధించారు. అలాగే బై.పి. సి విభాగం లో వై. వరుణ్ కుమార్ 976/1000 టౌన్ ఫస్ట్ గా నిలిచారు . ఇంకా 900 లకు పైగా మార్కులు సాధించిన మా విద్యార్థులు 58 మంది మార్కులు సాధించినట్లు కళాశాల సిబ్బంది తెలియజేసింది. అంతేగాక ప్రథమ సంవత్సర ఫలితాలలో ఎంపీసీ విభాగంలో బి. గుణ వర్షిణి 464/470 టౌన్ ఫస్ట్ బి.జాహ్నవి 461/470, కె. చంద్ర మోలిక 461/470, పి. ధన్వి 460/470, ఆర్. విజయ చంద్ర 460/470, పి.వి. కౌశిక 453/470, యన్. వేద 453/470, యస్. యాస్మిన్ 452/470, యన్. లక్ష్మీ లాస్విత 451/470, యం. హర్షిత 450/470 మార్కులు సాధించి టౌన్ టాప్ గా నిలిచారు . ఇంకా 400 మార్కులకు పైగా మార్కులు సాధించిన మా విద్యార్థులు 45 మంది తో పాటు జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో షేక్ యాసిన్ 429/440 టౌన్ ఫస్ట్ యస్. ఆయేషా 428/440 షేక్ సమీనా 423/440 పి. రమ్య 412/440 మార్కులు సాధించి టౌన్ టాపర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ భూమిరెడ్డి జయసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం మరియు ద్వితీయ సంవత్సరంలలో ఎంపీసీ మరియు బైపీసీ గ్రూపులలో మా కళాశాల విద్యార్థులు టౌన్ ఫస్ట్ గా నిలవడం అభినందనీయం అని, క్రమశిక్షణ పట్టుదలతోనే మా విద్యార్థులు ఈ ఘనవిజయాన్ని సాధించారని కొనియాడారు. అధ్యాపకుల కృషి, పట్టుదల వలనే ఇంతటి ఘనవిజయం సాధ్యమైందన్నారు అనంతరం విద్యార్థిని, విద్యార్థులను మరియు అధ్యాపకులను అభినందించారు.

# చిత్తూరు జిల్లా మహిళా క్రికెట్ జట్లకు ప్రాబబుల్స్ ఎంపికలు విజయవంతం

**వాల్మీకిపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:**

చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన అండర్ 19, అండర్23 బాలికల మరియు సీనియర్ మహిళా క్రికెట్ జట్లకు సంబంధించిన 2025 ప్రాబబుల్స్ ఎంపికలు వాల్మీకిపురంలోని జి.వి.ఎస్.సి.ఎస్. గ్రౌండ్‌లో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎంపికా కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన మదనపల్లి మరియు చిత్తూరు డివిజన్ల నుండి వచ్చిన 70 మంది యువతి క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఈ ఎంపికల సందర్భంగా అద్భుత ప్రతిభను ప్రదర్శించిన ఆటగాళ్లను గుర్తించి, వారు తదుపరి ప్రాబబుల్స్ లీగ్ మ్యాచ్‌లలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ తరహా సమగ్రమైన ఎంపికా పోటీలు జిల్లాలో ఇదివరకే ఎప్పుడూ నిర్వహించలేదని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జి. శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ,"జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) ఆదేశాల మేరకు ఈ సెలెక్షన్లు చేపట్టబడ్డాయి. నగరాల్లో లభించే ఆట అవకాశాలను ఇప్పుడు గ్రామీణ యువతకూ అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నం చేయటం చాలా హర్షణీయ విషయం. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆటతీరును మరింత మెరుగుపరచుకోవాలి," అని అన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, మహిళా క్రికెట్ అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. అభ్యర్థుల్లో క్రికెట్ పట్ల ఉన్న ఆసక్తి, పట్టుదల ఎంతో ప్రోత్సాహకరంగా ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈ ముగింపు కార్యక్రమంలో జిల్లా క్రికెట్ కోచ్ జి.సునీల్ కుమార్, సెలెక్షన్ కమిటీ సభ్యులు భరత్, చంద్రిక (కోచ్), అన్నమయ్య జిల్లా క్రీడా భారతి కార్యదర్శి నరేష్ బాబు, నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు పలువురు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన మహిళా క్రీడాకారులు

# నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యం



వసతి గృహ విద్యార్థులతో రాంగోపాల్ రెడ్డి



మౌలిక సదుపాయాల గురించి ఆరా తీస్తున్న రాంగోపాల్ రెడ్డి

**పులివెందుల ,ఏప్రిల్13,ప్రభాత వార్త:**

బీసీ, ఎస్సీ హాస్టల్ ల విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లపురెడ్డి పల్లె ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్ ను ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో ఉన్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో ఉన్న వంటగది, పడకగది, మరుగుదొడ్ల లను పరిశీలించారు. విద్యార్థులు ఆడుకునేందుకు వేసవి సెలవుల తర్వాత క్రికెట్ కిట్లను ఇస్తానన్నారు. అలాగే హాస్టల్ వార్డెన్ వెంకటరెడ్డిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత హాస్టల్లో నూతన విధానాన్ని తీసుకువచ్చి విద్యార్థులకు మంచి సౌకర్యాలను అందించడం కోసం ప్రత్యేక నిధులను ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరిగింది అన్నారు.

# కోళ్లబైలులో వివిధ అభివృద్ధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**

రూరల్ మండలంలోని కోళ్ళబైలులో రూ.3కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం కోళ్ళబైలు గ్రామ పంచాయితీలోని జామతోట కాలనీలో శిలాఫలకం ఆవిష్కరణ అనంతరం నిర్వహించిన బహిరంగసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కోళ్ళబైలు గ్రామ పంచాయితీలో ఇప్పటివరకు సిసిరోడ్లు, డ్రైనేజి కాలువల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లాదిరుపాయలు మంజూరు చేయడం జరగిందన్నారు. సొంత నిధులతో గ్రామంలో 425ఎల్ఈడి లైట్లు వేయించడం జరిగిందన్నారు. కోళ్ళబైలును అన్ని విధాల ఆదర్శంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కబ్జాదారుల స్వాధీనంలోని ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకొని పేద ప్రజల ఇళ్ళ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి రావాల్సింది ఉండగా అనివార్య కారణాల వల్ల రాలేకపోయారని తెలిపారు. మదనపల్లె నియోజకవర్గ పరిశీలకులు శివరామ్‌ప్రతాప్ ముఖ్య అతిధిగా పాల్గొని నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో కోళ్ళబైలు ఇన్‌చార్జ్ శ్రీనివాసులునాయుడు, నవీన్‌చౌదరి, చిన్నమహేష్, బెల్లె రెడ్డిప్రసాద్, తులసీరామక్రిష్ణ, మల్లికార్జుననాయుడు, డ్యాన్స్ రెడ్డప్ప, మోహన్, బిల్డర్ రామక్రిష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి స్వచ్ఛత సేవ

**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**

రాజంపేటలో ఆదివారం బిజెపి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి స్వచ్ఛత సేవా నిర్వహించి దీపారాధన చేయడం జరిగింది. బిజెపి జాతీయ పార్టీ పిలుపుమేరకు రేపు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని రాజంపేటలోని ఆర్ అండ్ బి అతిథి గృహం దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహానికి స్వచ్ఛత క్లీనింగ్ నిర్వహించి అనంతరం వారి విగ్రహానికి దీపారాధన చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన ఓ గొప్ప దార్శనికుడన్నారు. అన్ని వర్గాలకూ సమన్యాయం, సమాన అవకాశాలు లభించాలన్న వారి తపనను ఆచరణలో అమలు చేస్తూ అంబేద్కర్ గారి ఆశయాల సాధనకు బీజేపీ కట్టుబడి వుందన్నారు. కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు దేశానికి ఎన్నో సేవలు చేసిన వారికి సరైన గుర్తింపు ఇవ్వలేదని బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతే వారికి భారత రత్న ఇవ్వడము, అలాగే వారు నివసించి పరమపదించిన పెరిగిన స్థలాలన్నిటిని చారిత్రాత్మకంగా అభివృద్ధి చేసిన ఘనత ఒక్క బిజెపికే దక్కుతుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోగరాజు రమణయ్య, బిజెపి జిల్లా కార్యదర్శి తోట ధీరజ్, పట్టణ అధ్యక్షులు వివి రమణ, మండల అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ ఉపాధ్యక్షులు రమణారెడ్డి, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# స్తంభించిన డ్రైనేజీని పరిశుభ్రం చేయించాలి

**బద్వేలు అర్బన్ , ఏప్రిల్ 13 (ప్రభాతవార్త):**



పట్టణంలోని 22 వ వార్డు గాంధీనగర్‌లో డ్రైనేజీ కాలువ పూర్తిస్థాయిలో స్తంభించడంతో మురికి నీరు రోడ్డుపై ప్రవహించడంతో ఆ రహదారులలో పాదచారులు, వృద్దులు, చిన్నారులు రావాలంటే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి గాంధీనగర్ లో ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో డ్రైనేజీ కాలువ నుంచి దోమల వ్యాప్తి అధికంగా ఉండడంతో అనేక ఇబ్బందులకు గురి కావలసిన పరిస్తితి ఏర్పడిందని కావున మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని స్థంబించిన డ్రైనేజీ కాలువలను పరిశుభ్రం చేయించాలని పలువురు కాలనీ వాసులు వాపోతున్నారు.

**దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం:**



గాందీనగర్‌లో డ్రైనేజీకాలువలు గత కొద్ది రోజులుగా పూర్తిస్థాయిలో స్తంభించి దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. సాయంకాలం సమయం బయటకు రావాలంటేనే దుర్వాసనతో ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ అధికారులు స్పందించి కాలువలను వెంటనే పరిశుభ్రం చేయించాలి

బ్రహ్మయ్య ,22వ వార్డు, గాంధీనగర్, బద్వేలువాసి

# ఘనంగా జ్యోతుల ఉత్సవ వేడుకలు



**ప్రొద్దుటూరు ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

మండలం కామనూరు గ్రామంలో శ్రీ చౌడేశ్వరి దేవి గుడి వద్ద ఆదివారం శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు ఈ సందర్భంగా ఆ నాలుగు గంటలకు విందఁ సేవ రాత్రి 12 గంటల నుండి జ్యోతుల కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు కావున కుల బాంధవులు అమ్మవారి భక్తులు ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిఆశీస్సులు పొందినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ ప్రొద్దుటూరు మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి ఉమ్మడిశెట్టి లక్ష్మీనారాయణ ఉమ్మడిశెట్టి సుబ్బన్న చౌడం సుబ్బరాయుడు మడక రామాంజనేయులు చౌడం రవి గంజికుంట తారకరామా సగినాదం బాబు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

**లక్కిరెడ్డిపల్లి ఏప్రిల్ 13 ప్రభాతవార్త**



మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చెల్లు వంశీయులు గంగన్న యాదవ్ , సురేంద్ర యాదవ్ కుటుంబ సభ్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు క్యూ లైన్ లో వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మధుసూదన్, మార్కండేయ, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన అసర్ల గంగమ్మ జాతర





**గాలివీడు, ఏప్రిల్ 13(ప్రభాతవార్త):**

మండల కేంద్రంలోని బలిజపల్లి, నడింపల్లి మధ్య కుశావతి నదీతీరాన వెలసిన శ్రీ అసర్ల గంగమ్మ జాతర ఘనంగా ముగిసింది. శనివారం ఉదయం సిద్దలకూడు నైవేద్యంతో ప్రారంభమైన జాతర రాత్రికి నిండు తిరుణాలలో చెక్కభజనలు, ఆర్కెస్ట్రా, కోలాటాలు,బాణసంచాలతో భక్తులకు కనువిందు కలిగింది. మొక్కుబడులు కలిగిన భక్తులు చాందినీబండ్లను అమ్మవారి ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం కల్లిపాటు కార్యక్రమంతో జాతర ముగిసింది.

# ఆకట్టుకున్న పల్లె జానపద నృత్యాలు..





**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 13 ప్రభాతవార్త:**

కడప శిల్పారామంలో ఆదివారంలో సాంస్కృతిక కళావేదిక మీద వారాంతపు ఆట విడుపులో భాగంగా మిస్పా మూవీ వారి సహకారంతో కడప నగరానికి చెందిన కిషోర్ డాన్స్ అకాడమీ వారు శాస్త్రీయ నృత్యాలు, పల్లె జానపదాలు నృత్యాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గోదారి గట్టుమీద రామచిలకవే, గొబ్బియాలో గొబ్బియాలు, ఇస్మార్ట్ శంకర్, గళ్ళు గళ్ళు పాటలు ఆకట్టుకున్నాయి. శిల్పారామం పరిపాలన అధికారి ఎస్ కృష్ణ ప్రసాద్, ఫీల్డ్ సూపర్వైజర్ మధు సూదన్ బాబు పర్యవేక్షించారు.

## రోడ్డుపైన అడ్డంగా

# ఆటోలు నిలిపితే చర్యలు తప్పవు

**బద్వేల్ అర్బన్ ,ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

రోడ్డుపై అడ్డంగా ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపితే చర్యలు తప్పవనీ అర్బన్ సిఐ రాజగోపాల్, ఎస్ ఐ సత్యనారాయణ లు తెలిపారు. ఆదివారం వారు పోలీసు సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆటో డ్రైవర్లకు, తోపుడు బండి వ్యాపారస్తులకు, రోడ్డు ప్రమాదాలపై సలహాలు ఇచ్చారు. పలువురు ఆటో వారికి, తోపుడు బండి వ్యాపారస్తులకు రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తెలియజేయడంతో పాటు రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ నిలిపి ప్యాసింజర్ ఎక్కించుకోరాదని తెలియజేశారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, పోలీస్ చట్టాల పైన పలువురికి అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరు కూడా పోలీస్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డ్రైవింగ్ లైసెన్స్ మరియు ఆటోకు సంబంధించిన పలు రకాల రికార్డును ఎప్పటికప్పుడు సరి చూసుకుంటూ ఉండాలన్నారు. ప్యాసింజర్స్ ఎక్కేటప్పుడు దిగే సమయంలో జాగ్రత్తలు పాటిస్తూ ఆటోలు నడపాలన్నారు. ప్యాసింజర్ ని సురక్షితంగా గమ్యం చేర్చే విధంగా బాధ్యతను తీసుకోవాలన్నారు. ఆటో నడిపేటప్పుడు మద్యం సేవించి గాని మొబైల్ మాట్లాడుతూ గాని నడపడం వలన అనేక ప్రమాదాలకు దారితీస్తుందన్నారు, వాహనదారులు ప్రతి ఒక్కరు పోలీసు నిబంధనలు పాటిస్తూ ఉండాలని సూచించారు. మైనర్ పిల్లలు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు గురవయ్యతో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ముందస్తు నిర్బంధ చర్యలు అమానుషం

## (సుప్రీం కోర్టు తీర్పు)

**బద్వేలు లీగల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**

వ్యక్తులపై ముందస్తు నిర్బంధ చర్యలు అమానుషమైనవని దేశ అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. శిక్షాస్మృతి చట్టంలోని నియమ నిబంధనల ప్రకారం దోషులుగా నిర్ధారించడానికి వీలులేని కేసులలోనే వ్యక్తుల నేరపూరిత చర్యలను నిరోధించడానికి ముందస్తు నిర్బంధాన్ని ప్రయోగిస్తారని ధర్మాసనం ఉటంకించింది. అందుకు రాజ్యాంగంలోని అధికరణ-22(3) ముందస్తు నిర్బంధానికి అనుమతిస్తుందని కూడా తెలిపింది. నిర్ణీత కాల పరిమితి లేకుండా విచారణ జరపకుండానే దోషిగా నిర్ధారణ కాకుండానే దీర్ఘ కాలం పాటు వ్యక్తులను నిర్బంధంలో ఉంచడం వ్యక్తిగత స్వేచ్ఛలను హరించడమే అవుతుందని ధర్మాసనం సుస్పష్టం చేసింది. మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా కేసులో భార్యాభర్తలకు వ్యతిరేకంగా నాగాలాండ్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేస్తూ సదరు నిందితుల అరెస్టుకు కారణాలను వెల్లడించకపోవడంతో పాటు నిబంధనలు పాటించలేదని అస్పష్టమైన ఉత్తర్వులను జారీ చేశారంటూ ధర్మాసనం ఆక్షేపించింది కూడా. డ్రగ్స్ అక్రమ రవాణా నిరోధక చట్టం-1988 లోని సెక్షన్-3 ప్రకారం తమపై జారీ అయిన ప్రభుత్వ ఉత్తర్వులను నిందారోపణలు ఎదుర్కొంటున్న అష్రాఫ్ హుస్సేన్ చౌదరి, ఆయన భార్య అదల్యూ చవాన్ మొదట గౌహతీ హైకోర్టులో సవాల్ చేస్తూ పిటీషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో వారి పిటీషన్ తిరస్కరణకు గురికావడంతో సదరు దంపతులు సుప్రీం కోర్టును ఆశ్రయించగా ధర్మాసనం విచారణ జరిపి సదరు దంపతులపై నిర్బంధ ఉత్తర్వుల చెల్లుబాటును గౌహతీ హైకోర్టు తగిన విధంగా పరిశీలించలేదని ధర్మాసనం అభిప్రాయపడుతూ పిటీషనర్ల అభ్యర్థనలను త్రోసిపుచ్చిన హైకోర్టు ఆదేశాలను కూడా రద్దు చేస్తున్నట్లు సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడం గమనార్హం.

# ఇంటర్ ఫలితాల్లో శ్రీ మేధ విజయభేరి





**పీలేరు ఏప్రిల్ 13 ప్రభాతవార్త:**

ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో పీలేరు శ్రీమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయభేరి మ్రోగించారని కళాశాల ప్రిన్సిపాల్ లోకేష్ బాబు తెలిపారు. 202425 విద్యా సంవత్సరానికి గత నెలలో జరిగిన ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల సీనియర్ ఎంపీసీ విద్యార్థి ఎస్ఎం కేతన 1000/986 మార్కులు, ఎస్. మెహతాజ్ 1000/980, ఎస్. నందిని 1000/980 మార్కులు సాధించారని అన్నారు. అలాగే జూనియర్ ఎంపిసిలో జి. వినూష 470/448 మార్కులు, వై. సంజన 470/ 442 మార్కులు, జూనియర్ బైపిసిలో ఎస్. సనాసమ్రీన్ 440/421 ఫాతిమా 440/398 మార్కులు, జూనియర్ సీఈసీలో యు. హరీష్ 500/452, నవరసాల వీణాధరి 500/438 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ అన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ వై. సంజీవ, అధ్యాపకులు అభినందించారు.

# మద్దెమ్మ గుడిలో వైభవంగా వార్షికోత్సవం.



పూజలు నిర్వహిస్తున్న రవి, ప్రసన్న కుమార్ దంపతులు

**తంబళ్లపల్లె. ఏప్రిల్ 13 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లి లో వెలసిన పురాతన మద్దెమ్మ ఆలయంలో ఆలయ స్థాపకులు రవి కుమార్, ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో వైభవంగా వార్షికోత్సవం నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయంలో ప్రధాన అర్చకుడు అమర్నాథ్ ఆధ్వర్యంలో మద్యం మా తల్లికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అదేవిధంగా రవికుమార్, ప్రసన్న కుమార్ దంపతులు, కుటుంబ సభ్యులచే వాస్తు పూజ, వాస్తు శాంతి, కళశ పూజ, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం మద్దెమ్మ తల్లికి మహా కుంభాభిషేకం, ఆదిదేవత, ప్రతి దేవత పూజా కార్యక్రమాలు తోబాటు భజన కార్యక్రమాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో బాటు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో చౌడ సముద్రం శేఖర్ గుప్తా, గంగిరెడ్డిపల్లి, చౌడ సముద్రం పంచాయతీలోని వందలాదిగా భక్తులు హాజరై మద్దెమ్మ దేవత కు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# గంగమ్మ గుడిలో భజన కార్యక్రమం



రాయలచెట్ల గంగమ్మ ఆలయ ప్రాంగణంలో భజన చేస్తున్న భక్తులు

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 13. ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె మండలం పంచాలమర్రిలో వెలసిన వాయాలచెట్ల గంగమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం పెద్ద ఎత్తున భజన కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఈమధ్య వైభవంగా నిర్వహించిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, కర్పూర హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా పంచాలమర్రి పంచాయతీ పరిధిలోని వందలాదిమంది భక్తులు అమ్మవారి కీర్తనలు, స్తోత్రాలు, భజన కార్యక్రమాలు, కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

# మిట్స్ విద్యార్థులు క్రీడా నైపుణ్యం కలిగి ఉండాలి

**కురబలకోట ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

మదనపల్లె, సమీపం లోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ (మిట్స్) కళాశాల విద్యార్థులు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ అనంతపురం (JNTUA) నిర్వహించిన 13వ జె.యెన్.టి.యు అనంతపూర్ (JNTUA) ఇంటర్‌కాలేజియేట్ గేమ్స్‌లో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. త్రోబాల్ (మహిళలు) - విజేతలు గా 1వ స్థానం, బ్యాడ్మింటన్ (పురుషులు సింగిల్స్) విజేతలు గా 1వ స్థానం, బ్యాడ్మింటన్ (పురుషులు డబుల్స్) విజేతలు గా 1వ స్థానం మరియు వాలీబాల్ (పురుషులు) రన్నర్లుగా 2వ స్థానం లో నిలిచినట్లు ఆయన అన్నారు. విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి మరియు శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించడానికి తగినంత ప్రోత్సాహం మరియు వనరులను అందిస్తూ, ప్రతిభ మరియు చక్కటి విద్యకు కేంద్రంగా తమ కళాశాల నిలుస్తోందని అని ఆయన అన్నారు. విజేతలను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, ఫిసికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, మంజు విక్రమ్‌లు అభినందనలు తెలియజేసారు.

